సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 2 । ఆగస్టు । 2025



న్యాయం చేస్తారా..

టెక్కలి పోలీస్‌స్టేషన్ ఎదుట ఓ మహిళ ఆందోళనకు దిగారు. పురుగు మందు బాటిల్‌తో కలకలం రేపారు.

- 8లో



జాప్యానికి సిగ్గుపడుతున్నాం

స్టేడియం పనుల్లో జాప్యానికి సిగ్గుపడుతున్నామని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. పీడీ-పీఈటీ వర్క్‌షాప్‌లో మాట్లాడారు.

- 8లో

ఇన్‌చార్జి డీఈఓగా ఎం.శ్రీనివాసరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా విద్యాశాఖాధికారిగా (ఇన్‌చార్జి)గా అసిస్టెంట్ డైరెక్టర్ (స్కీమ్స్)-2 మంగిపూడి శ్రీనివాసరావు నియమితులయ్యారు. జూలై 31వ తేదీ వరకు డీఈఓగా పనిచేసిన డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య పదవీవిరమణ చేయడంతో.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయన ఏడీ-2కి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో మూడున్నరేళ్లగా ఏడీ-2గా ఎం.శ్రీనివాసరావు విధులు నిర్వర్తిస్తున్నారు.

న్యూస్‌రీల్

2478 మంది ఉంటే.. 800 మందికే రేషన్

సారవకోట: మండలంలో వృద్ధులు, దివ్యాంగుల ఇచ్చే రేషన్ సరుకులు 800 మందికి మాత్రమే అందజేశారు. జూలై నెల 25 నుంచి 31లోగా వృద్ధులు, దివ్యాంగుల ఇంటికెళ్లి రేషన్ సరుకులు అందజేయాలి. మండలంలో 2478 మంది వృద్ధులు, దివ్యాంగులు ఉండగా.. 800 మందికి మాత్రమే అందజేశారు. సంబంధిత అధికారులు రేషన్ డీలర్లకు దీనిపై సరైన ఆదేశాలు అందించకపోవడం వల్లనే కొందరు రేషన్‌కు దూరమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లా జైలు ఆకస్మిక తనిఖీ



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి హరిబాబు

గార: అంపోలు జిల్లా జైలును జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి కె.హరిబాబు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముద్దాయిలకు అందించే ఆహార పదార్థాలను రుచి చూశారు. గ్రంథాలయం, మహిళా బ్యారక్‌లు పరిశీలించి ముద్దాయిలతో మాట్లాడారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచనలతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జైలర్ దివాకర్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో నాగుపాము



బద్దవానిపేట అంగన్ వాడీ కేంద్రంలో పట్టుకున్న నాగుపాము

నరసన్నపేట: మండలంలోని బద్దవానిపేట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నాగు పాము భయోత్పాతం సృష్టించింది. 10 అడుగులకు పైగా పొడవున్న పామును సెంటర్‌లో ఒక్కసారిగా చూసిన అంగన్‌వాడీ వర్కర్ పి.వనజాక్షి ఆందోళనకు గురైంది. స్థానికులు వెంటనే స్పందించి పామును పట్టుకుని బయటకు వదిలారు. అంగన్‌వాడీ వర్కర్ వనజాక్షి మాట్లాడుతూ ఉదయం 9 గంటల సమయంలో కేంద్రాన్ని తెరిచానని, నలుగురు పిల్లలను బయట కూర్చోబెట్టి తలుపులు తెరిచి వంట చేసేందుకు అట్ట పెట్టె తెరవగా పాము కనిపించిందని, స్థానికులను పిలిస్తే వారు వచ్చి పట్టుకుని బయటకు పంపారని తెలిపారు.

జిల్లా డైమండ్ జూబ్లీ వేడుకలకు శ్రీకారం



మాట్లాడుతున్న డీఆర్‌ఓ వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం జిల్లా ఏర్పడి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆగస్టు 13 నుంచి 15 వరకు మూడు రోజులపాటు జరిగే డైమండ్ జూబ్లీ వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పురోగతిని ప్రతిబింబించేలా ప్రతి కార్యక్రమాన్ని రూపొందించాలని, ప్రజలంతా పాల్గొనాలనిపించేలా ఉత్సవాలు ఉండాలని ఆయన అన్నారు.

- ఆగస్టు 13న ఉదయం 10 గంటలకు మున్సిపల్ హైస్కూల్ మైదానంలో వేడుకలు ప్రారంభం.
- 1950 నుంచి 2025 వరకు జిల్లాలో అభివృద్ధిని ఆవిష్కరించే సాంస్కృతిక ప్రదర్శనలు.
- సాయంత్రం 4 నుంచి 7.30 వరకు ఆర్ట్స్ కాలేజీ రోడ్ నుంచి 7 రోడ్ల జంక్షన్ వరకు శోభాయాత్ర. ఆదివాసీ తెగల జానపద నృత్యాలు, సంగీతం, వారసత్వ కార్యక్రమాలు ప్రధాన ఆకర్షణ.
- రాత్రి 6 నుంచి 10 వరకు ఫుడ్ స్టాల్స్. స్థానిక రుచులు, తెగల మిల్లెట్ ఫుడ్, తీరప్రాంత వంటకాలు అందుబాటులోకి.
- ఆగస్టు 14న ఉదయం 8 నుంచి సంప్రదాయ క్రీడల పోటీలు, చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు. థింసా నృత్యాలు, స్వాతంత్ర్య పోరాట ఇతివృత్తాల నాటకాలు.
- ఆగస్టు 15న స్వాతంత్ర్య వేడుకల అనంతరం డైమండ్ జూబ్లీ ప్రత్యేక పతాకం ఆవిష్కరణ.







● శ్రావణం.. పావనం

పవిత్ర శ్రావణ శుక్రవారం పూట అమ్మవారి ఆలయాలు కళకళలాడాయి. జిల్లా కేంద్రంలోని బలగలో గల బాలా త్రిపుర కాలభైరవ ఆలయంలోని అమ్మవారిని లక్ష గాజులతో సలక్షణంగా అలంకరించారు. అలాగే 108 రకాల పిండి వంటలతో నైవేద్యాన్ని సమర్పించారు. సంతోషిమాత ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

– శ్రీకాకుళం కల్చరల్

కొందరికే సుఖీభవ..!




- వ్యవసాయ శాఖ మంత్రి జిల్లాలో తగ్గిన 'అన్నదాత సుఖీభవ' అర్హుల సంఖ్య
- ఈ ఏడాది 2.74లక్షల మందికి మాత్రమే సుఖీభవ
- వైఎస్సార్ హయాంలో 3.22 లక్షల మందికి రైతు భరోసా అందించిన వైనం
- గత ఏడాదిని పూర్తిగా విస్మరించిన కూటమి ప్రభుత్వం

ఒక ఏడాదిని పూర్తిగా మర్చిపోయి.. ఆ బకాయికి తమకు సంబంధం లేదన్నట్టుగా వ్యవహరించి.. రెండో ఏడాదిలో రైతుల సంఖ్యను కుదించేసి.. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం ఇప్పుడు 'అన్నదాత సుఖీభవ' అంటోంది. ఖరీఫ్ పనులు ప్రారంభమై అన్నదాతలు పెట్టుబడులను అప్పుల రూపంలో సమకూర్చుకున్న చాన్నాళ్ల తర్వాత సర్కారుకు రైతులపై దయ కలిగింది. గత ప్రభుత్వంలో ఖరీఫ్ ఆరంభంలోనే 'రైతు భరోసా' పేరిట కర్షకులకు సాయం అందేది. కానీ ప్రభుత్వం మారాక ఏడాది గడిచి.. రెండో ఏడాదిలో ఆగస్టు వస్తే గానీ పథకానికి మోక్షం కలగలేదు.

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకానికి ముహూర్తం ఖరారు చేసింది. ఆగస్టు 2న రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడానికి సిద్ధమైంది. ఏడాది పాటు ఊరించి ఊరించి ఇప్పటికి ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 3.22 లక్షల మందికి రైతుభరోసా డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తే.. కూటమి పాలనలో ఏడాది పాటు అన్నదాత సుఖీభవ డబ్బులు ఎగ్గొట్టి కేవలం 2.74లక్షల మందిని మాత్రమే అర్హుల జాబితాలో చూపించడం రైతులను విస్మయపరుస్తోంది. సాక్షాత్తు వ్యవసాయ శాఖ మంత్రి ఉన్న జిల్లాలోనే రైతుల సంఖ్య తగ్గిపోయిందంటే రాష్ట్ర వ్యాప్తంగా ఇంకెంత దారుణంగా ఉంటుందోనని రైతులు చర్చించుకుంటున్నారు.

అప్పులు చేశాక సాయం..



ఏటా నైరుతి రుతుపవనాలు జూన్ చివరిలో వచ్చేవి. ఈ ఏడాది మాత్రం మే నెల చివరి నాటికే ప్రవేశించాయి. దీంతో ఖరీఫ్ కాసింత ముందుగానే మొదలైంది. ఇది వరకు ఖరీఫ్ పనులు మొదలయ్యే నాటికే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా కింద సాయం అందజేసేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి ఏటా రైతులకు రూ.20 వేలు ఇస్తామని ప్రకటించిన చంద్రబాబు ఒక ఏడాదిని మర్చిపోయి.. రెండో ఏడాది ఆగస్టు వచ్చేనాటికి జమ చేయడం దారుణమని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే రైతులు పొలాలు దుక్కి దున్నడానికి, విత్తనాలు కొనుగోలు చేయడానికి ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేశారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాక ఇంత ఆలస్యంగా పథకాన్ని అమలు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

లెక్కలన్నీ చూస్తే..

అన్నదాత సుఖీభవ కింద తామే సొంతంగా రైతులకు రూ.20వేలు అందిస్తామని మొదట కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక కేంద్రం ఇచ్చే సాయంతో కలిసి ఆ మొత్తాన్ని అందజేస్తామని చెప్పారు. అలా చెప్పాక కూడా మొదటి ఏడాదిని పూర్తిగా విస్మరించారు. రెండో ఏడాదిలోనూ జూన్, జూలై మాసాలు దాటిపోయాక ఆగస్టులో పథకానికి ముహూర్తం పెట్టారు. కానీ లెక్కలన్నీ తరచి చూస్తే కూటమి ప్రభుత్వం కొత్తగా ఇచ్చేది ఏమీ ఉండదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో కేంద్రం, రాష్ట్రం కలిపి ఏడాదికి రూ.13,500 ఇచ్చేవి. ఈ నగదును ఐదేళ్ల పాటు అందించారు. 2019–20 మొదలుకుని 2023–24 వరకు రూ.1983.73కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మొదటి ఏడాది అన్నదాత సుఖీభవ అమలు చేయలేదు. ఎన్నికలు జరిగే ఆఖరి సంవత్సరంలోనే ఈ సాయం అందించే వీలు దాదాపు కుదరదు. మధ్యలో మూడేళ్ల మాత్రమే అన్నదాత సుఖీభవ అమలు చేసే వీలుంది. అంతా కలిపితే రైతులకు అందే సాయంలో పెద్దగా మార్పు ఉండబోదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. దీనికి తోడు వైఎస్సార్ సీపీ హయాంలో అమలు చేసిన వైఎస్సార్ సున్నా వడ్డీ, డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ.. వంటి సంక్షేమాలకు కూటమి మంగళం పాడింది.

నేడు అన్నదాత సుఖీభవ నిధులు జమ



అన్నదాత సుఖీభవ నిధుల్ని రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 2.74 లక్షల మంది రైతుల్ని అర్హులుగా గుర్తించాం. ఒక్కొక్కరి ఖాతాలో రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.5వేలు చొప్పున మొత్తం రూ.135కోట్లు, పీఎం కిసాన్ రూ.2వేలు చొప్పున 2.33లక్షల మందికి గాను రూ.46కోట్లు జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతుల ఖాతాల్లో జమ చేయనున్నాం.

– త్రినాథస్వామి, జిల్లా వ్యవసాయాధికారి, శ్రీకాకుళం జిల్లా

హాస్టళ్లను రక్షించాలని వినతి



జేసీని కలిసిన వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని దాదాపు అన్ని సంక్షేమ హాస్టళ్లు, గురుకుల విద్యాలయాలు సంక్షోభంలో కూరుకుపోయాయని, వాటిని రక్షించాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు ముత్తా విజయ్ కుమార్, మరికొంత మంది యువత విద్యార్థులు జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను కోరారు. వారు శుక్రవారం జేసీని ఆయన చాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. వైఎస్ జగన్ పిలుపు మేరకు హాస్టళ్లలో సమస్యలు తెలుసుకున్నామని, అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని హాస్టళ్లలో పరిస్థితులు క్షీణించాయని, పారిశుధ్యం, తాగునీరు వంటి అనేక సమస్యలు ఉన్నాయన్నారు. చాలా హాస్టళ్లలో మరుగుదొడ్లకు తలుపులు కూడా లేవన్నారు. మెనూ సక్రమంగా అమలు కాక పిల్లలు పురుగుల అన్నం తింటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ పిల్లలు అనారోగ్యాల బారిన పడుతున్నారని జేసీకి వివరించారు. వెంటనే హాస్టళ్లను పరిశీలించి వారికి మెరుగైన వసతులు కల్పించాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ దినోత్సవం రోజున రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రభుత్వం అందజేయనున్న నేపథ్యంలో.. అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌చార్జి డీఈఓ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఆగస్టు 8వ తేదీలోగా సంబంధిత మండల విద్యాశాఖాధికారులకు నేరుగా సమర్పించాలన్నారు. అవార్డులకై మూడు విభాగాల్లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందని, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అర్హులైన ఉపాధ్యాయులను ఐదుగురు సహోపాధ్యాయులు సిఫార్సు చేయాల్సి ఉంటుందని చెప్పారు. మండల విద్యాశాఖ అధికారులు అర్హులైన దరఖాస్తులను పరిశీలించి, సంబంధిత ప్రతిపాదనలను జిల్లా స్థాయికి పంపిస్తే.. ఇక్కడ ఉప విద్యాశాఖాధికారులు తమ డివిజనల్ పరిధిలో డివిజనల్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తారని.. అలా ఎంపిక చేసిన ఉపాధ్యాయుల వివరాలను జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పంపించాల్సి ఉంటుందని ఇన్‌చార్జి డీఈఓ శ్రీనివాసరావు స్పష్టంచేశారు.

ఎంఈఓ–1 నియామకాల్లో ఉమ్మడి సీనియారిటీ పాటించారా..?



డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఆపస్, పీఆర్‌టీయూ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర ప్రభుత్వం గత నెల 30న విడుదల చేసిన ఎంఈఓ–1 నియామకాల ఉత్తర్వుల్లో పంచాయతీరాజ్, ప్రభుత్వ ఉపాధ్యాయుల ఉమ్మడి సీనియారిటీ నుంచి ఎంపిక చేయకుండా కేవలం ప్రభుత్వ ఉపాధ్యాయులను మాత్రమే పరిగణలోకి తీసుకోవడం దుర్మార్గమని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్), పీఆర్‌టీయూ సంఘాలు తీవ్రంగా తప్పుబట్టాయి. ఈ మేరకు జిల్లా కేంద్రంతోపాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనలో భాగంగా రాష్ట్ర సంఘాల పిలుపుమేరకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఈఓ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని, లేకుంటే తీవ్రస్థాయి ఉద్యమం చేపడతామని ప్రభుత్వానికి హెచ్చరించారు. అనంతరం వారు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు.

కార్యక్రమంలో ఆపస్ సంఘం నాయకులు దుప్పల శివరామ్ ప్రసాద్ పీఆర్‌టీయూ నాయకులు తంగి మురళి మోహనరావు, పప్పల రాజశేఖర్, కీలు సోమేశ్వరరావు, పైడి కాశీ విశ్వనాథరావు, బత్తుల రవి, ఎచ్చెర్ల మురళి, వేణు తదితరులు పాల్గొన్నారు.

పాలకులకు గుణపాఠాలు చెప్పాలని..

- బోధనలో ఎదురవుతున్న సమస్యలు, ఆర్థిక పరమైన అంశాల సాధనపై నేడు పోరుబాట
- బోధనేతర బాధ్యతలపై గుర్రుగా ఉన్న గురువులు
- సీపీఎస్ రద్దు, కారుణ్య నియామకాలు ఇతరత్రా డిమాండ్ల సాధనే ధ్యేయంగా ధర్నా
- కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టేందుకు ఏర్పాట్లు



ధర్నాను విజయవంతం చేయాలని నినదిస్తున్న ఫ్యాప్టో నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాలకులకు గుణ'పాఠాలు' చెప్పేందుకు గురువులు సిద్ధమవుతున్నారు. ఉద్యోగ లోకానికి ఇచ్చిన హామీలపై అతీగతీ లేకపోవడంతో సర్కారు చెవులకు వినిపించేలా గర్జించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించి, పాఠాలు చెప్పేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ శనివారం ఆందోళన చేసేందుకు ఉద్యుక్తులయ్యారు. సర్కారు వైఖరిపై గురువులంతా గుర్రుగా ఉన్నారు. తమ డిమాండ్లను ఎప్పటికప్పుడు చెప్పుకుంటున్నా అటు ప్రభుత్వంలో గానీ, ఇటు ఉన్నతాధికారుల్లో గానీ చలనం లేదు. కనీసం సీఎంగాని, చీఫ్ సెక్రటరీ గానీ సమావేశం నిర్వహించడం లేదని, ఒక ప్రకటన కూడా చేయడం లేదని వాపోతున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలవడం కూడా కష్టంగా మారిపోయిందని అంటున్నారు. ఇలాంటి తరుణంలో, గత్యంతరం లేని పరిస్థితుల్లో ఉపాధ్యాయులు ఉద్యమ బాటకు శ్రీకారం చుడుతున్నారు.

నేడు ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా..

అటు విద్యాశాఖలో ఉపాధ్యాయులకు పాఠాల బోధనకు ఎదురవుతున్న సమస్యలు, ఇటు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఆర్థిక పరమైన డిమాండ్ల సాధనకై రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 2వ తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ధర్నాకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లాలో సైతం ధర్నాను భారీ ఎత్తున నిర్వహించేందుకు ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఏర్పాట్లు చేస్తున్నారు. 18 ప్రధానమైన డిమాండ్ల సాధనకు శనివారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఫ్యాప్టో చైర్మన్ బమ్మిడి శ్రీరామ్మూర్తి, సెక్రటరీ జనరల్ పడాల ప్రతాప్‌కుమార్, కో చైర్మన్లు పూజారి హరిప్రసన్న, వాల్తేటి సత్యనారాయణ, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎస్‌వీ రమణమూర్తి, మజ్జి మదన్‌మోహన్, బి.వెంకటేశ్వర్లు, కోశాధికారి కె.జగన్‌మోహన్‌రావు, కార్యవర్గ సభ్యులు ఎల్.బాబూరావు, పి.కృష్ణారావు, వై.వాసుదేవరావు, జి.రమణ, ఎస్‌వీ అనిల్‌కుమార్, బి.రవి, ఎస్‌ఏఎల్‌వీ పూర్ణిమ తదితరులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫ్యాప్టో ప్రధాన డిమాండ్లలో కొన్ని..

- ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు లేకుండా చేయాలి. పీ–4 వంటి కార్యక్రమాన్ని ఉపాధ్యాయులకు నిర్బంధం చేయరాదు.
- నూతనంగా అప్‌గ్రేడ్ అయిన స్థానాలను కోరుకున్న ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలి.
- ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యలు పరిష్కరించి విద్యాశాఖలో ఉన్న అసంబద్ధతను తొలగించాలి.
- అంతర్ జిల్లాల బదిలీలను చేపట్టాలి.
- 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి.
- 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్)ని తక్షణమే ప్రకటించాలి. మూడు పెండింగ్ డీఏలను ప్రకటించాలి. డీఏ బకాయిలను, 11వ పీఆర్సీ బకాయిలను, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే చెల్లించాలి.
- సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి.

బోధనేతర పనులు వద్దు



ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలం పాటు నిరీక్షించాం. అయినా ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదు. వీటికి తోడు టీచర్లకు బోధనకు అవకాశం లేకుండా అనేక యాప్‌లు, కార్యక్రమాలతో ఆటంకం కలిగిస్తున్నారు. బోధనేతల పనుల నుంచి విముక్తి కలిగించాలి. సీపీఎస్ రద్దు చేసి పెండింగ్ బకాయిలపై తక్షణమే స్పందించాలి.

– పడాల ప్రతాప్‌కుమార్, జిల్లా ఫ్యాప్టో సెక్రటరీ జనరల్

వెంటనే 30 శాతం ఐఆర్ ప్రకటించాలి..



కూటమి ప్రభుత్వం తమ ఎన్నికల వాగ్దానంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన వాగ్దానాలపై కనీసం ప్రభుత్వం పెద్దల నుంచి ఓ ప్రకటన వస్తుందని నిరీక్షించాం. కానీ ఎవరూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల గురించి పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీ నియామకం చేసి, 30 శాతం ఐఆర్ ప్రకటించాలి. లేకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం తప్పదు.

– మజ్జి మదన్‌మోహన్, ఫ్యాప్టో జిల్లా కో చైర్మన్

ధర్నా విజయవంతం చేయాలి



ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద నేడు ఉదయం 9 గంటల నుంచి పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. అన్ని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, టీచర్లు, ఉద్యోగులు, పెన్షనర్లు హాజరై విజయవంతం చేయాలి.

– బమ్మిడి శ్రీరామ్మూర్తి, ఫ్యాప్టో జిల్లా చైర్మన్

అమృతమూర్తికి అశ్రునివాళి



కీ॥శే॥ బంకురు అన్నపూర్ణమ్మ గారు

ఆప్యాయతానురాగాలు పంచిన ఆదర్శ గృహిణి, మంచికి మారుపేరుగా నిలిచి పిల్లలు మరియు కుటుంబ సభ్యులపై నీవు చూపే ప్రేమాభిమానాలు ఎప్పటికీ మరువలేము. నీ ఆకస్మిక మరణం మాకు తీరని లోటు. భౌతికంగా మా నుండి దూరమైనప్పటికీ కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువర్గానికి నీవు ఇచ్చే సూచనలు, సలహాలు పాటిస్తూ... నీ మధుర జ్ఞాపకాలు మా అందరి మదిలో సదా పదిలం. నీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ... అశ్రునయనాలతో అంజలి ఘటిస్తూ...

భర్త: బంకురు శ్రీరాములునాయుడు

పెద్ద కుమార్తె - అల్లుడు : పల్లి సుజాత - నరసింహులు
మనుమలు/ మనుమరాండ్రు : డా॥ కింజరాపు షర్మిల - డా॥ శ్రీనివాసనాయుడు
మునిమనుమరాలు: శ్రేష్ఠశ్రీనివాస్
మనుమడు/ మనుమరాలు: డా॥ శ్రీహర్ష - డా॥ సాయిగాయత్రి
మునిమనుమడు : శశ్వత్
రెండవ కుమార్తె - అల్లుడు : మెండ సుధారాణి - సింహాచలం
మనుమలు/ మనుమరాండ్రు : మెండ శరత్‌చంద్ర - ప్రవల్లిక
మనుమడు : మెండ సాయిచరణ్
చిన్న కుమార్తె - అల్లుడు : చీకటి సునీత - జగదీశ్వరరావు
మనుమరాండ్రు : చి॥ షిర్గ, చి॥ శ్రావ్య

క్లుప్తంగా

రేపు జిల్లాస్థాయి యోగా పోటీలు



టీషర్టులను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నరసన్నపేట: నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 3న జిల్లా యోగాసనా చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివేకానంద ధ్యాన యోగా సమితి అధ్యక్షుడు కింజరాపు రామారావు తెలిపారు. యోగాసన స్పోర్ట్ అసోషియేషన్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. దీనిలో భాగంగా అభ్యాసకులకు ఇచ్చే టీషర్టులను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ , ఎన్‌వైఎస్ఎఫ్ కార్యదర్శి బోత్స కేదారినాథ్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఉదయం 7 కల్లా సభా ప్రాంగణానికి చేరుకోవాలని కోరారు.

బాక్సర్‌కు అభినందనలు



యువ బాక్సర్ సత్యభార్గవ్‌తో డీఎస్‌డీఓ శ్రీధర్‌రావు, కోచ్ ఉమా

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన యువ బాక్సింగ్ సంచలనం జి.సత్యభార్గవ్‌ను డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు అభినందించారు. శుక్రవారం కోడిరామ్మూర్తి స్టేడియం వద్ద శిక్షణకు హాజరైన సత్యభార్గవ్‌ను, తీర్చిదిద్దుతున్న కోచ్ పి.ఉమామహేశ్వరరావును మెచ్చుకున్నారు. హర్యానాలోని రోతక్ వేదికగా జరిగిన ఆలిండియా జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఈ యువ బాక్సర్ రజత పతకంతో మెరిసిన విషయం తెలిసిందే. దీంతో ఇండియన్ కోచింగ్ క్యాంప్‌కు ఎంపికయ్యాడు. త్వరలో శిక్షణా శిబిరాలకు హాజరుకానున్నట్లు కోచ్ తెలిపారు.

రెడ్డీస్‌లో బ్యాటరీలు చోరీ

రణస్థలం: పైడిభీమవరం పారిశ్రామికవాడలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ సీటీవో-6 పరిశ్రమలో గత నెల 23న నాలుగు పెద్ద బ్యాటరీలు చోరీ జరిగినట్లు జె.ఆర్.పురం పోలీసులు తెలిపారు. పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్.చిరంజీవి శుక్రవారం చెప్పారు.

స్టేడియం పనుల్లో..
జాప్యానికి సిగ్గుపడుతున్నాం



పీడీ-పీఈటీల వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న శ్రీకాకుళం ఎమ్మెల్యే శంకర్, సంఘ నాయకులు

- పీడీ-పీఈటీ వర్క్‌షాప్ ప్రారంభంలో ఎమ్మెల్యే శంకర్
- గ్రిగ్స్‌మీట్ క్రీడాపోటీలకు రూ.5లక్షలు మంజూరు చేయిస్తామని హామీ

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి స్టేడియం పనుల్లో జాప్యం జరగడంపై సిగ్గుపడుతున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. అయితే దీనివెనుక సవాలక్ష కారణాలు ఉన్నాయని చెప్పారు. శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియం ప్రాంగణంలో జిల్లా పీడీ-పీఈటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల సెమినార్ కమ్ వర్క్‌షాప్ శుక్రవారం ప్రారంభమైంది. జిల్లా పీడీ-పీఈటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని.. ఎన్ని ప్రభుత్వాలు మారినా వారికి పూర్తి స్థాయిలో సౌకర్యాలు, వసతులు కల్పించలేకపోతున్నామని చెప్పారు. ఈ ఏడాది ఐదు జోనల్ పరిధిలో గ్రిగ్స్‌మీట్‌ల నిర్వహణకు అవసరమైన రూ. 5లక్షల నిధులను మంజూరుకు కలెక్టర్‌తో మాట్లాడి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఉప విద్యాశాఖాధికారులు ఆర్.విజయకుమారి (శ్రీకాకుళం), పి.విలియమ్స్(టెక్కలి) మాట్లాడుతూ పీడీ-పీఈటీలకు పాఠశాలల్లో క్రీడల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను పరిష్కారిస్తామన్నారు.

అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ స్కూల్ గేమ్ ఫెడరేషన్, గ్రిగ్స్ పోటీల కోసం జిల్లా, డివిజన్, నియోజకవర్గం స్థాయి క్రీడల నిర్వహణ తలెత్తుతున్న సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సలహాదారు పి.సుందరరావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బి.వి.రమణ, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు, సంపతిరావు సూరిబాబు, మెట్ట తిరుపతిరావు, తవిటయ్య, రాజారావు, శేఖర్‌బాబు, నారాయణరావు, జగదీష్, నిర్మల్‌కృష్ణ, హెచ్‌ఎంలు హరిబాబు, పోలినాయుడు, ఎమ్మెస్ చంద్రశేఖర్, ఎంఈఓ సోంబాబు, విజయనగరం జిల్లా అసోసియేషన్ కార్యదర్శి వెంకట్‌నాయుడు, నియోజకవర్గ, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్లు, పీడీలు, పీఈటీ పాల్గొన్నారు.

నిధులు కేటాయించండి..

జోన్-1 పరిధిలో రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఆర్‌ఐ పీఈ) పోస్టును ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలి. గ్రిగ్స్‌మీట్‌లను ఐదు జోన్‌ల పరిధిలో నిర్వహించేందుకు కనీసం రూ.5 లక్షలకు తక్కువ కాకుండా ప్రభుత్వం నిధులు కేటాయింపు చేయాలి. స్కూల్‌గేమ్స్ ఎంపికల పోటీల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ బిల్డింగ్ కోసం కేంద్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– మొజ్జాడ వెంకటరమణ, పీడీ-పీఈటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

అక్షర ఆంధ్ర విజయవంతం చేయాలి

- కలెక్టర్ డాక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో అక్షరాస్యత శాతం పెంపునకు లక్ష్యంగా అమలు చేస్తున్న అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. దూరదర్శన్ (జూమ్) ద్వారా శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 1,12,071 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా 66,000 మంది, గ్రామీణ ఉపాధి హామీ సంస్థ ద్వారా 36,000 మంది, పట్టణ అభివృద్ధి సంస్థ ద్వారా 9,000 మందికి వయోజన విద్య వలంటీర్లను 1:10 నిష్పత్తిలో ఎంపిక చేయాలని సూచించారు. వారు స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలు, సంఘాల భవనాల్లో అక్షరాస్యత తరగతులు నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు. జిల్లా స్థాయిలో జెడ్పీ ముఖ్య కార్యనిర్వాహక అధికారి, జిల్లా ప్రణాళిక అధికారి, గ్రామీణాభివృద్ధి సంస్థ పథకాల సంచాలకులు, ఉపాధి హామీ సంస్థ పథక సంచాలకులు, పట్టణ అభివృద్ధి సంస్థ పథకాల సంచాలకులు, జిల్లా విద్యాధికారి, బాలల అభివృద్ధి సంస్థ అధికారి తదితరులు సమితి సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. మండల స్థాయిలో ఎంపీడీఓ, పాఠశాల విద్యాధికారి, గ్రామీణాభివృద్ధి సంస్థ పథకాల సహాయకులు, ఉపాధి హామీ సంస్థ అభివృద్ధి అధికారి, బాలల అభివృద్ధి అధికారి, వయోజన విద్య పర్యవేక్షకులు సభ్యులుగా ఉంటారని వివరించారు. వయోజన విద్య ఉప సంచాలకుడు ముద్దాడ వెంకటరమణ సభ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తారని చెప్పారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, గ్రామీణాభివృద్ధి సంస్థ పథకాల సంచాలకుడు ఎం.కిరణ్ కుమార్, ఉపాధి హామీ పథకం సంచాలకుడు సుధాకర్‌రావు, పట్టణ అభివృద్ధి సంచాలకుడు ఎస్.వి.రమణ, జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

7న ప్రతిభా పోటీలు

ఎచ్చెర్ల : శ్రీకాకుళం జిల్లా ఏర్పడి 75 వసంతాలు పూర్తికావస్తున్న సందర్భంగా పీజీ, డిగ్రీ విద్యార్థులకు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం జర్నలిజం మాస్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 7న ప్రత్యేక ప్రతిభా పోటీ నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనూరాధ శుక్రవారం తెలిపారు. జిల్లా చరిత్ర, సంస్కృతి, స్వాతంత్య్ర ఉద్యమంలో జిల్లా పాత్ర, జిల్లా ప్రగతిలో ముఖ్య ఘట్టాలు, జిల్లాలో జన్మించిన వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు తదితర అంశాలపై విద్యార్థులు సమాధానాలు రాయాల్సి ఉంటుందన్నారు. వర్సిటీతో పాటు అనుబంధ కళాశాలల డిగ్రీ విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 83095 19615 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

శ్రీకాకుళం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే అత్యుత్తమ పెన్షన్ విధానం అమలు చేస్తోందని ఎస్ఎంఈ, ఎన్నారై, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. పాత్రునివలసలో శుక్రవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీ ప్రకారం ప్రతి నెలా ఒకటో తేదిన పెన్షన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో నెలకు సుమారు రూ. 2,700 కోట్లు వెచ్చిస్తున్నామని చెప్పారు.

రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన సూపర్‌సిక్స్ హామీలన్నింటినీ నెరవేర్చామని మంత్రి స్పష్టం చేశారు. ఆదివారం అన్నదాత సుఖీభవ పథకం, 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయి ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



టెక్కలి రూరల్: స్థానిక పట్టుమహాదేవి కోనేరు గట్టుపై శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడి వయసు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, రెండు రోజులుగా టెక్కలిలోనే తిరిగాడని స్థానికులు చెబుతున్నారు. గురువారం రాత్రి సమీప షాపుల బయట పడుకుని ఉదయం వెళ్లిపోయాడని, మధ్యాహ్నానికి మృతి చెంది కనిపించాడని అంటున్నారు. మృతుడు నీలం టీషర్టు, ట్రాక్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వివరాలు తెలిసిన వారు పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ రాము కోరారు.

బోటు బోల్తాపడి మత్స్యకారుడు మృతి

- గోవాలో ఘటన



కారి రాజులు(ఫైల్)

వజ్రపుకొత్తూరు: పల్లివూరు పంచాయతీ హుకుంపేటకు చెందిన మత్స్యకారుడు కారి రాజులు(44) గోవాలో శుక్రవారం చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజులు స్థానికంగా వేట సాగకపోవడంతో గోవాకు వలసవెళ్లాడు. అక్కడ శుక్రవారం సాయంత్రం 3.30 గంటల సమయంలో వేట సాగిస్తుండగా అలల ధాటికి బోటు బోల్తా పడింది. బోటు కిందే రాజులు చిక్కుకుపోయి ప్రాణాలు కోల్పోయాడు. రాజులు తల్లిదండ్రులు బాల్యంలోనే చనిపోగా, భార్య నాగమ్మ, ఇద్దరు కుమార్తెలు స్వాతి, స్వప్న ఉన్నారు. విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గోవా పోలీసులు పోస్టుమార్టం చేయించి మృతదేహాన్ని గ్రామానికి పంపిస్తారని స్థానికులు తెలిపారు.

దళితుల భూములకు రక్షణ కల్పించాలి



దళితుల భూములను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ఎచ్చెర్ల : బుడతవలస దళితల భూములకు రక్షణ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరాపు సింహాచలం, జిల్లా ప్రధాన కార్యదర్శి కోనారి మోహనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం లావేరు మండలం బుడతవలస గ్రామాన్ని సందర్శించి వివాదాస్పద భూమిని వీరు పరిశీలించారు. 2006లో అప్పటి ప్రభుత్వం దళితులైన పిన్నింటి లక్ష్మీ, రమణమ్మ, కుప్పిలి అనసూయ, సింహాచలంలకు సర్వే నంబర్లు 344/4, 344/8, 344/9, 344/10 లో 6.43 ఎకరాల డీ పట్టాలను మంజూరు చేసిందని తెలిపారు. ఈ భూముల్లో నీలగిరి మొక్కలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని చెప్పారు. ఇటీవల నడుపూరి రాంబాబు, మహంతి రాజులు, రూప వచ్చి నీలగిరి తోటలు నరుక్కుపోయారని, ఈ విషయమై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, భూములను దళితులకు అప్పగించాలని డిమాండ్‌చేశారు.

కార్మికుల పొట్టకొట్టొద్దు



మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న ఐఎంఎల్ యూనిట్ కార్మికులు

ఎచ్చెర్ల: రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోకు భూములిచ్చిన కార్మికుల పొట్టలను కొట్టవద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు కోసం ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం డిపో వద్ద హమాలీలు మోకాళ్లపై కూర్చుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు తీసుకుని ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా ఉపాధిని కల్పించారని చెప్పారు. ఇప్పటికీ దీనినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ఈ తరుణంలో డిపోను విడదీసి బతుకులను రోడ్డుపాలు చేయడం తగదన్నారు. నిరసన కార్యక్రమంలో హమాలీల యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.బంగార్రాజు, టి.రామారావు, ఎం.సురేష్, బోనెల రాము, లింగాల రాము, జి.గురుమూర్తి, పట్నాన రామారావు, ఎల్.సీతారాం, రాజు, కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

కూలిన కల్వర్టు



సంతబొమ్మాళి మండలం పాత మేఘవరం నుంచి బోరుభద్ర వెళ్లే రోడ్డులో చిదపానవానిపేట సమీపంలో వంశధార కల్వర్టు శుక్రవారం రాత్రి కూలిపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. 30 ఏళ్ల కిందట నిర్మించిన ఈ కల్వర్టు కూలిపోవడంతో మత్స్యకార గ్రామాలు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి కల్వర్టు పునర్నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

– సంతబొమ్మాళి

న్యాయం చేస్తారా.. చనిపోమంటారా?

- పురుగుమందు బాటిల్‌తో మహిళ నిరసన
- టెక్కలి పోలీస్‌స్టేషన్ ఎదుట కలకలం



స్టేషన్ ముందు బైఠాయించిన మహిళకు నచ్చజెబుతున్న పోలీసులు

టెక్కలి రూరల్: తనకు, పిల్లలకు న్యాయం చేయాలని, లేదంటే ఆత్మహత్య చేసుకుంటాననంటూ శుక్రవారం ఓ మహిళ పురుగుల మందుతో టెక్కలి పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించింది. గతంలో తన భర్తతో తగాదా ఉంటే పోలీసులు కోర్టులో రాజీ చేయించి తమను బాగా చూసుకుంటాడని చెప్పారని, తర్వాత పూర్తిగా పట్టించుకోవడం మానేశాడని వాపోయింది. తనకు న్యాయం జరగకపోతే చావే శరణ్యమన్నారు. దీంతో పోలీసులు ఆమెకు నచ్చజెప్పి పురుగు మందు బాటిల్‌ను తీసుకుని స్టేషన్ లోకి తీసుకువెళ్లి మాట్లాడారు. భర్తను పిలిపించి తనకు న్యాయం చేస్తామని ఎస్ఐ రాము నచ్చజెప్పి అక్కడ నుంచి పంపించారు. కాగా, స్టేషన్ వద్ద మహిళ బైఠాయించిందన్న విషయం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు స్టేషన్‌కు చేరుకుని వివరాలు సేకరించే క్రమంలో పోలీసులు అడ్డుతగిలారు. ఫొటోలు తీయడానికి వీలు లేదంటూ పంపించేశారు.

అంబులెన్సులో ప్రసవం



తల్లీబిడ్డలతో అంబులెన్సు సిబ్బంది

మందస: పుత్తూరు గ్రామానికి చెందిన సవర కుమారికి రెండో కాన్పులో భాగంగా శుక్రవారం పురిటినొప్పులు మొదలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు 108 అంబులెన్సుకు సమాచారం అందించారు. ఈఎంటీ ఉప్పాడ గోపాలకృష్ణ, పైలట్ చిన్నవాడు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. తిరిగి వస్తుండగా మార్గమధ్యలో వీరగున్నమ్మపురం వద్ద నొప్పులు ఎక్కువ కావడంతో అక్కడే వాహనం ఆపి ప్రసవం చేయించడంతో పండింటి ఆడబిడ్డ జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉండటంతో హరిపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు.

క్యాంపస్ డ్రైవ్‌లో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందిస్తున్న డైరెక్టర్ బాలాజీ

ఎచ్చెర్ల : శ్రీకాకుళంలోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో ఏడుగురు సీఎస్‌ఈ విద్యార్థులు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని గ్రిడ్లెక్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగాలు దక్కించుకున్నారు. నెలకు రూ. 20 వేలు స్టైపండ్‌తో ఇంటర్న్‌షిప్ పూర్తి చేశాక సంవత్సరానికి రూ.8,00,00 ప్యాకేజీ అందిస్తారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ, అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ మునిరామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్స్ డాక్టర్ శివరామకృష్ణ, ఫైనాన్స్ అధికారి వాసు, వెల్ఫేర్ డీన్ డాక్టర్ గేదెల రవి, సీఎస్‌ఈ విభాగాధిపతి వై.రమేష్, అధ్యాపకులు అభినందిస్తూ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందించారు.

సమాచార హక్కు చట్టంతో జవాబుదారీతనం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: సమాచార హక్కు చట్టం అమలుతో ప్రభుత్వ శాఖల్లో జవాబుదారీతనం పెరిగిందని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ (అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు అన్నారు. ఆమదాలవలస, రాజాం, పాలకొండ, తొగరాం, సీతంపేట, వీరఘట్టం, శ్రీకాకుళం(పురుషులు, మహిళలు) కాలేజీల్లో వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ తదితర పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో శుక్రవారం శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం -2005 ప్రవేశపెట్టి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఈ పోటీలు నిర్వహించిందన్నారు. ఈ చట్టంభారత పౌరులకు ప్రభుత్వ కార్యాలయాల నుంచి సమాచారాన్ని పొందే హక్కును కల్పిస్తుందన్నారు. పాలనలో పారదర్శకతతోపాటు జవాబుదారీతనాన్ని పెంచిందన్నారు. పోటీల విజేతలను జోనల్‌స్థాయికి పంపిస్తామని, చివరిగా రాష్ట్రస్థాయిలో పోటీలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చిన్నారావు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.మౌనిక, బోటనీ హెచ్‌ఓడీ ఎస్.రుద్రమరాణి, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలకు ముందస్తు ఏర్పాట్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 15న ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగే వేడుకలు విశిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సేవల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులకు మాత్రమే అవార్డుల కోసం సిఫార్సులు పంపించాలన్నారు. సంబంధిత వివరాలను ఈ నెల 10లోగా పంపించాలని ఆదేశించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

BUSINESS OFFER

We are Ready to Invest to Develop Your Business. We also Welcome Agent., Good Commission for Agents. Call 90926 92403 [IA-076]

WANTED

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9959031122, 9676901122 [B-1275596]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

రీజనల్ ఆఫీస్, ఇ.నెం.8, సింహద్వారం ఆర్చ్ దగ్గర, వెంకటాపురం, శ్రీకాకుళం జిల్లా. ఫోన్ : 08942 - 270919.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియజేస్తూ 30 రోజుల ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క నిబంధన 6(2) / 8(6) ప్రకారం)

వీరినుండి :

చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, రీజనల్ ఆఫీస్, శ్రీకాకుళం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

దిగువ వారికి :

విషయము : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెల్లించవలసిన బకాయి మొత్తము రాబట్టుటకు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ (యాక్ట్ 54 ఆఫ్ 2002) క్రింద మీకు చెందిన ఆస్తిని విక్రయించుట

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సెక్యూర్డ్ క్రెడిటార్ మీరు బకాయిలు చెల్లించవలసినదిగా కోరుతూ సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని సెక్షన్ 13(2) ప్రకారం దిగువ తెలిపిన తేదీలలో డిమాండ్ నోటీసును జారీ చేసినారు. నిర్దేశించిన సమయంలో, నిర్ణీత వ్యవధిలో మీరు నోటీసులో పేర్కొన్న బకాయిని చెల్లించడంలో విఫలమైనందున అధీకృత అధికారి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 6/8తో చదివే చట్టంలోని సెక్షన్ 13 (4) ప్రకారం స్థిరాస్తులను దిగువ తెలిపిన తేదీలలో లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకున్నారు.

సెక్యూర్డ్ ఆస్తిని స్వాధీనం చేసుకున్న తరువాత కూడా మీరు బ్యాంకుకు చెల్లించవలసిన మొత్తాన్ని చెల్లించలేదు. కావున ఈ నోటీసు అందిన తేదీ నుండి 30 రోజుల తరువాత ఆన్‌లైన్ మోడ్ ద్వారా దిగువ పేర్కొన్న ఆస్తులను విక్రయించడం కొరకు ఇ-వేలం నిర్వహించాల్సిన సర్వీస్ ప్రొవైడర్ వివరాలు మీకు విడిగా తెలియజేయబడతాయి.

కావున, మీరు బ్యాంక్‌కు చెల్లించాల్సిన మొత్తాన్ని విక్రయ నోటీసును ప్రచురించే తేదీకి ముందు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు వ్యయాలతో పాటు బ్యాంక్‌కు చెల్లించినట్లయితే ఆస్తి అమ్మకంపై తదుపరి చర్యలు తీసుకోబడదు మరియు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ ఆస్తిని విడిపించుకోవచ్చు.

ఋణగ్రహీతలు / సహ-పూచీదారులు/ హామీదారులు మరియు పేద్యాలు ఆస్తి వివరములు

1 అరసవల్లి బ్రాంచ్, శ్రీకాకుళం జిల్లా — ఫోన్ : 93218 22685

ఋణగ్రహీతల యొక్క పేర్లు: 1. శ్రీ కిల్లారి రామ్ ప్రసాద్‌రావు, తండ్రి : మోహన్‌రావు, పెద్ద వీధి, కదుము, కొత్తూరు మండలం, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్ - 532457 (దరఖాస్తుదారు). 2. శ్రీమతి కిల్లారి రేణుక (మరణించినారు), భర్త : కె. రామ్ ప్రసాద్‌రావు, పెద్ద వీధి, కదుము, కొత్తూరు మండలం, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్ - 532457 (సహ-ఋణగ్రహీత). 3. కుమారి కె. దీపిక శ్రీ (మైనర్ అయినందున ప్రాతినిధ్యం వహిస్తున్న తండ్రి మరియు సహజ సంరక్షకుడు), తండ్రి : శ్రీ కిల్లారి రామ్ ప్రసాద్‌రావు, పెద్ద వీధి, కదుము, కొత్తూరు మండలం, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్ - 532457 (మరణించినవారి చట్టరీత్యా వారసులు). 4. మాస్టర్ కె. ముకేష్ మోహిత్ కుమార్ (మైనర్ అయినందున ప్రాతినిధ్యం వహిస్తున్న తండ్రి మరియు సహజ సంరక్షకుడు), తండ్రి: శ్రీ కిల్లారి రామ్ ప్రసాద్‌రావు, పెద్ద వీధి, కదుము, కొత్తూరు మండలం, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్ - 532457 (మరణించినవారి చట్టరీత్యా వారసులు).

డిమాండ్ నోటీసు తేది : 22.08.2023 — స్వాధీనత నోటీసు తేది : 27.11.2023

స్థిరాస్తి వివరములు: కొల్లేటరల్ సెక్యూరిటీ: శ్రీకాకుళం జిల్లా మరియు మండలం, చాపురం పంచాయితీ, బలగ రూరల్, ఫ్లాట్ నెం.6, సర్వే నెం.274 లోని 233.6 చ॥గజల మొత్తం స్థల విస్తీర్ణంలో 25 చ॥గజల అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా విస్తీర్ణంతో క్రింద + 3 పై నివాస అంతస్తులతో కూడిన "ఆదిత్య రెసిడెన్సీ" భవనం మూడవ అంతస్తు నందు 1000 చ॥అ॥లు (కామన్ ఏరియాలతో సహా) విస్తీర్ణంతో గల ఫ్లాట్ నెం.టి-2 యావత్తు ఆస్తి సమీప ల్యాండ్ మార్క్ - ఇందు బ్యూటీ పార్లర్ మరియు శ్రీ వికాస్ జూనియర్ కాలేజ్, టిసిసిలి కాలనీ నివాసి అయిన శ్రీ కిల్లారి రామ్ ప్రసాద్ రావు గారి పేరున కలదు. హద్దులు: తూర్పు : ఓపెన్ టు స్కై, దక్షిణం : మెట్లు కొంతమేర, కామన్ కారిడార్ కొంతమేర, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : ఓపెన్ టు స్కై, మొత్తం స్థలం విస్తీర్ణం 233.6 చ॥గ॥ సకు హద్దులు: తూర్పు : సారు తాత గారి మాగాణి భూమి, దక్షిణం : ఫ్లాట్ నెం.7, పడమర : గరాడెన జగ్గయ్య గారి ఫ్లాట్ నెం.5, ఉత్తరం : 33 అ॥ల వెడల్పు లే అవుట్ రోడ్డు.

2 ఋణగ్రహీతల యొక్క పేర్లు: 1(ఎ). శ్రీ పరిటి వెంకట సూర్య నరసింహ మూర్తి, తండ్రి : వెంకట రమణ మూర్తి (లేటు), 15-8-10, కోవెల వీధి, అరసవల్లి, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్ - 532401 (దరఖాస్తుదారు). 2(ఎ). శ్రీమతి పరిటి జానకి, భర్త : వెంకట సూర్య నరసింహ మూర్తి, డోర్ నెం. 15-8-10, కోవెల వీధి, అరసవల్లి, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్ - 532401 (సహ-దరఖాస్తుదారు). 3. శ్రీ కొల్లూరు సంతోష్ కుమార్, తండ్రి: సుబ్రహ్మణ్యం, డోర్ నెం.9-5-84, గుడి వీధి, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్ - 532001 (సహ-దరఖాస్తుదారు).

డిమాండ్ నోటీసు తేది : 03.05.2025 — స్వాధీనత నోటీసు తేది : 07.07.2025

స్థిరాస్తి వివరములు: కొల్లేటరల్ సెక్యూరిటీ : శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం ఎస్‌ఆర్‌ఓ పరిధిలో, శ్రీకాకుళం మున్సిపాలిటీ, శ్రీకాకుళం టౌన్, పాత శ్రీకాకుళం వార్డు, అరసవల్లి గ్రామం, కామన్ రాస్తా యొక్క పడమర వరుస, సూర్యనారాయణ స్వామి గుడి వీధికి దక్షిణం వరుస వద్ద సమీప డోర్ నెం.15-6-4, సర్వే నెం.525 పార్ట్ వద్ద 121.125 చ॥గ॥లు లేదా 101.26 చ॥మీ॥లు విస్తీర్ణం గల భూమి మరియు భవనం. హద్దులు: తూర్పు : కామన్ రాస్తా, దక్షిణం : సురవాజుల్ల సుబ్బారావు గారి ఖాళీ స్థలం, పడమర : బంకుపల్లి శ్రీనివాసరావు గారి ఇల్లు, ఉత్తరం: పరిటి వెంకట సూర్య నరసింహమూర్తి గారి ఖాళీ స్థలం.

3 సోంపేట బ్రాంచ్, శ్రీకాకుళం జిల్లా — ఫోన్ : 8686483484

ఋణగ్రహీతల యొక్క పేర్లు: 1 (ఎ). శ్రీ శ్యామ సుందరరావు బురగాన, తండ్రి : లేటు ఆదినారాయణ, డోర్ నెం.1-222, బనిశెట్టి వీధి, సోంపేట గ్రామం & పంచాయితీ, సోంపేట మండలం, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్ - 532284. 1 (బి). శ్రీ బి. శ్రీనివాసరావు, డోర్ నెం.1-222, బనిశెట్టి వీధి, సోంపేట గ్రామం & పంచాయితీ, సోంపేట మండలం, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్ - 532284.

డిమాండ్ నోటీసు తేది : 26.12.2023 — స్వాధీనత నోటీసు తేది : 21.03.2024

స్థిరాస్తి వివరములు: శ్రీకాకుళం, సోంపేట గ్రామ పంచాయితీ, జలంత్ర సోంపేట గ్రామం, సమీప డోర్ నెం.1-222, సర్వే నెం.237/5 వద్ద 100 చ॥గ॥లు విస్తీర్ణం గల భూమి మరియు భవనం శ్రీ శ్యామ సుందర రావు బురగాన గారికి చెందినది. హద్దులు : ఉత్తరం : శ్రీశయన వీధి పేరిల్లు, తూర్పు : గంటా విజయ గారి ఆర్‌సిసి స్లాబ్ ఇల్లు, పడమర : బెహరా బైరి గారి టైల్డ్ ఇల్లు, దక్షిణం : రాజమార్గం - పంచాయితీ రోడ్డు.

4 హరిపురం బ్రాంచ్, శ్రీకాకుళం జిల్లా — ఫోన్ : 9137129621

ఋణగ్రహీతల యొక్క పేర్లు: 1. ఎజ్జి నారాయణరావు, తండ్రి : ఎజ్జి పాపయ్య (లేటు), డోర్ నెం.1-91, ఎస్ సి కాలనీ, టెక్కలిపట్నం గ్రామం, పలాస మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 532220. 2. ఎజ్జి శేషాదేవి, భర్త: ఎజ్జి నారాయణ రావు, డోర్ నెం.1-91, ఎస్ సి కాలనీ, టెక్కలిపట్నం గ్రామం, పలాస మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 532220.

డిమాండ్ నోటీసు తేది : 08.12.2023 — స్వాధీనత నోటీసు తేది : 21.03.2024

స్థిరాస్తి వివరములు: శ్రీకాకుళం జిల్లా, పలాస మండలం, టెక్కలిపట్నం గ్రామం & పంచాయితీ, ఎస్ సి వీధి, ఎమ్‌పిపి స్కూల్ & చావర రోడ్డు దగ్గర, అసెస్మెంట్ నెం.131, సర్వే నెం.65/2 లోని 202.22 చ॥గ॥ల విస్తీర్ణంలో గల భూమి మరియు భవనం (నివాస) యావత్తు ఆస్తి ఎజ్జి శేషా దేవి గారికి చెందినది. హద్దులు : తూర్పు : బసకల మల్లేశు గారి ఇల్లు, పడమర : బసకల అప్పారావు గారి ఇల్లు, ఉత్తరం : రోడ్డు, దక్షిణం : రోడ్డు.

5 ఋణగ్రహీతల యొక్క పేర్లు: 1. శ్రీ ఇప్పిలి రమేష్, తండ్రి : లేటు కృష్ణారావు, ఇ.నెం.1-300, ఎస్ సి వీధి, మాలపేట, తర్ల గూడూరు గ్రామం, గరుడభద్ర పోస్ట్, వజ్రపుకొత్తూరు మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 532222. 2. శ్రీమతి ఇప్పిలి రాణి, భర్త : ఇప్పిలి రమేష్, ఇ.నెం.1-300, ఎస్ సి వీధి, మాలపేట, తర్ల గూడూరు గ్రామం, గరుడభద్ర పోస్ట్, వజ్రపుకొత్తూరు మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 532222.

డిమాండ్ నోటీసు తేది : 08.12.2023 — స్వాధీనత నోటీసు తేది : 21.03.2024

స్థిరాస్తి వివరములు: శ్రీకాకుళం జిల్లా, వజ్రపు కొత్తూరు మండలం, గరుడభద్ర పంచాయితీ మరియు పోస్ట్, తర్ల గూడూరు గ్రామం వద్ద సర్వే నెం.31/9బి లోని 73.33 చ॥గ॥ల విస్తీర్ణంలో గల భూమి మరియు భవనం (నివాస) యావత్తు ఆస్తి శ్రీ ఇప్పిలి రమేష్ గారికి చెందినది. హద్దులు: తూర్పు : గరియా ఎర్రయ్య గారి ఆర్‌సిసి ఇల్లు, పడమర : చుక్కా పున్నయ్య గారి ఆర్‌సిసి ఇల్లు, ఉత్తరం : వీధి రోడ్డు, దక్షిణం : రోడ్డు.

తేది : 22-07-2025
ప్రదేశం : శ్రీకాకుళం

సం/- అధీకృత అధికారి & చీఫ్ మేనేజర్
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా